45)మాళవిగౌళ/తోడి

ప॥ కలియుగ మెటులైనా గలదుగా నీకరుణ। జలజాక్ష హరిహరి సర్వేశ్వరా॥

చ॥ పాప మెంత గలిగిన బరిహరించేయందుకు। నాపాల గలదుగా నీనామము।
కోపమెంత గలిగిన కొచ్చి శాంతమిచ్చుటకు। చేపట్టి కలవుగా నాచిత్తములో నీవు॥

చ॥ ధర నింద్రియా లెంత తరముకాడిన నన్ను। సరి గావగద్దుగా నీశరణాగతి।
గరిమ గర్మ బంధాలు గట్టినతాళ్ళు వూడించ। నిరతి గలదుగా నీభక్తి నాకు॥

చ॥ హితమైనయిహపరా లిష్టమైనవెల్లా నియ్య। సతమై కలదుగా నీసంకీర్తన-।
తతి శ్రీవేంకటేశ నాతపము ఫలియింపించ। గతి గలదుగా నీకమలాదేవి॥